అండగా నిలుస్తూ.. పునర్జన్మనిస్తూ



రోగుల సేవలో తరిస్తున్న వైద్యులు

- ఆపద కాలంలో రోగుల పాలిట ఆపద్బాంధవులు
- ప్రభుత్వ రంగంలో మెరుగైన వైద్యసేవల్లో ముందడుగు

పాలమూరు: ప్రాణం పోసేది బ్రహ్మ అయితే పునర్జన్మ ఇచ్చేది వైద్యుడు. అందుకే వైద్యో నారాయణో హరి అని అన్నారు పెద్దలు. ప్రతి ఒక్కరూ వైద్యుడిలో దేవుడిని చూస్తారు. ఎంత గొప్ప వ్యక్తి అయినా.. పేదవాళ్లు అయినా చేతులెత్తి నమస్కరించేది వైద్యులకు మాత్రమే. ప్రాణపాయ స్థితిలో ఉన్నా.. ప్రమాదంలో గాయపడినా.. ఎలాంటి ఆపద వచ్చినా గుర్తుకు వచ్చేది వైద్యులే. వారి ఆత్మీయ స్పర్శ రోగికి అపర సంజీవని. ప్రస్తుత పరిస్థితులలో ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా కొత్త కొత్త రోగాలు వస్తున్నాయి. రోజూ వేల మంది రోగులకు వైద్యులు వివిధ రకాల చికిత్సలు అందిస్తున్నారు. రోగుల ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నారు. ఎంతో మంది వైద్యులు మానవత్వంతో అభాగ్యులకు సేవలందిస్తూ.. అందరి మన్ననలు పొందుతున్నారు. సోమవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల 2016లో ప్రారంభం కాగా.. ఇప్పటి వరకు 450 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్నారు. 2016లో 150 మంది, 2017లో 150, 2018లో 150 మంది వైద్యవిద్య అభ్యసించారు. ప్రస్తుతం 2019 బ్యాచ్‌లో 175 మంది హౌజ్ సర్జన్లుగా జిల్లా జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఇక 2020 బ్యాచ్‌లో 175 మంది, 2021లో 175 మంది, 2022లో 175 మంది, 2023లో 175 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు మెడికల్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 875 మంది విద్యార్థులు భవిష్యత్‌లో వైద్యులుగా సేవలు అందించనున్నారు.

22 ఏళ్ల అనుభవం..



ఉస్మానియా యూనివర్సిటీలో 1992 నుంచి 1996 వరకు ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత గాంధీలో 2002లో జనరల్ సర్జరీ విభాగంలో ఎంఎస్ పూర్తిచేశా. అనంతరం మూడేళ్లపాటు యూకేలో శిక్షణ పూర్తి చేసుకొని కర్నూలు, ఉస్మానియా ఆస్పత్రిలో విధులు నిర్వహించాను. గతేడాది నుంచి జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధు లు నిర్వహిస్తున్నాను. ఈ 22 ఏళ్ల అనుభ వంలో ఎంతో మందికి సేవలు అందించా. పేదలకు సేవ చేయడం గొప్పగా భావిస్తున్నా. ప్రతి ఒక్కరికీ సహనంతో పరీక్షించడంతో పాటు అర్థమయ్యే విధంగా చెప్పడం అలవాటు చేసుకున్నాను.

– డాక్టర్ జీవన్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

కరోనా సమయంలో ఇంటింటికెళ్లి చికిత్స..



కరోనా సమయంలో ఇంటింటికి తిరిగి చికిత్స అందించడం, ప్రతి ఒక్కరికి ధైర్యం కల్పించడం నా జీవితంలో మరిచిపోలేను. కరోనా పాజిటివ్ వచ్చిన వారి వద్దకు వెళ్లి భరోసా ఇవ్వడంతో పాటు వారికి కావాల్సిన మందులు, సూచనలు ఇచ్చాను. నేను 2014లో కర్నూలులో ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత 2017లో సర్వీస్‌లోకి వచ్చాను. మొదట మిడ్జిల్‌లో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరాను. గతేడాది పీహెచ్‌సీని జాతీయ నాణ్యతా ప్రమాణాల కమిటీ ఎంపిక చేయడం కోసం కృషి చేశాను. దీంతో సర్వీస్ అప్‌గ్రేడ్ కావడం, నిధులు రావడం జరుగుతుంది.

– డాక్టర్ శివకాంత్, మెడికల్ ఆఫీసర్, మిడ్జిల్

ఎన్నో సర్జరీలు చేశాను..



ఉస్మానియా యూనివర్సిటీలో 1987 లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత 1992 వరకు గాంధీలో ఎంఎస్ జనరల్ సర్జరీ పూర్తిచేయగా.. అదే ఏడాది జహీరాబాద్ సమీపంలోని కోహీర్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. 1996 వరకు అక్కడ పనిచేసి, ఎన్నో సర్జరీలు చేశాను. ఉత్తమ వైద్యుడిగా అవార్డు అందుకున్నా. 1996 నుంచి 2006 వరకు ఉస్మానియాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన సమయంలో ఎన్నో హైరిస్క్ సర్జరీలు చేసి, ప్రాణాలు కాపాడిన సందర్భాలు ఉన్నాయి. 2006 నుంచి 2008 వరకు కర్నూలు మెడికల్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2009 నుంచి 2012 వరకు గాంధీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఆ తర్వాత 2012 నుంచి 2021 వరకు ఉస్మానియాలో ప్రొఫెసర్‌గా, జనరల్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీగా పనిచేశాను. ఆ తర్వాత ఏడీఎంఈగా పదోన్నతి లభించి, మహబూబ్‌నగర్‌కు వచ్చాను.

– డాక్టర్ రమేష్, మెడికల్ కళాశాల డైరెక్టర్, మహబూబ్‌నగర్

బస్సులో డెలివరీ చేయడం మరిచిపోలేను..



2010లో ఎంబీబీఎస్ పూర్తిచేయగా.. 2011 నుంచి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో పనిచేశాను. హన్వాడలో ఏడాది పాటు పని చేసిన తర్వాత జానంపేట పీహెచ్‌సీకి వెళ్లాను. 2014లో పోస్టింగ్ రెగ్యులర్ కావడం జరిగింది. జానంపేట నుంచి ఓ రోజు మహబూబ్‌నగర్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్తుంటే.. ఓ గర్భిణి కొత్తకోట నుంచి రెఫర్ మీద ప్రసవం కోసం జిల్లా ఆస్పత్రికి వస్తుంది. ఈ క్రమంలో మార్గమధ్యలో ఆమెకు నొప్పులు రావడంతో బస్సులోనే నేను డెలివరీ చేశాను. ఆ ఘటనను నా జీవితంలో మరిచిపోలేను. తల్లీబిడ్డలను పీహెచ్‌సీకి తీసుకెళ్లి, చికిత్స అందించి కావాల్సిన బెనిఫిట్స్ అందించాం. జాతీయస్థాయిలో ఒకసారి, రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు అవార్డులు తీసుకున్నాను.

– డాక్టర్ శ్వేతారెడ్డి

ఏడాదిన్నరలో 435 సాధారణ కాన్పులు..



ఏడాదిన్నర కాలంలో దేవరకద్ర పీహెచ్‌సీలో 435 సాధారణ కాన్పులు చేశాం. సాధారణ ఓపీతో పాటు ప్రసవాలపై ఎక్కువ దృష్టి సారించాను. పీహెచ్‌సీల వారీగా పరిశీలిస్తే.. జిల్లాలో అత్యధిక కాన్పులు ఇక్కడే అవుతాయి. దీంట్లో కొంత వరకు హైరిస్క్ ఉన్న కేసులు సైతం బాధ్యతగా తీసుకుని ప్రసవాలు చేయడం జరిగింది. నేను 2015లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత లట్టుపల్లి, బిజినేపల్లి, కోయిలకొండ సివిల్ ఆస్పత్రి, మహబూబ్‌నగర్, ప్రస్తుతం దేవరకద్రలో పనిచేస్తున్నాను. 24 గంటల్లో ఎప్పుడూ డెలవరీ కోసం వచ్చినా నాతో పాటు సిబ్బంది సిద్ధంగా ఉంటారు. ఈ ఏడాది జనవరి 26న ఉత్తమ వైద్యుడిగా ప్రశంసపత్రం అందుకున్నా.

– డాక్టర్ శరత్‌చంద్ర, పీహెచ్‌సీ, దేవరకద్ర

గిరిజన ప్రాంతాల్లో సేవలు..



కొల్లాపూర్ గిరిజన ఏరియాలో విధులు నిర్వహించే క్రమంలో ప్రయాణానికి నిత్యం ఇబ్బందులు పడేవాళ్లం. పది నెలలపాటు ఆ ఏరియాలో ఉన్న ప్రతి గ్రామాన్ని సందర్శించాం. డెంగీ కేసులు అధికంగా వచ్చిన సందర్భంగా ఒక అమ్మాయికి పరిస్థితి ఇబ్బందిగా ఉంటే, మెరుగైన చికిత్స అందించడంతో పాటు ఇంటికి వెళ్లి పర్యవేక్షించాను. నేను 2015లో కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత జనరల్ ఆస్పత్రిలో ఎస్‌ఆర్‌సీలో రెండు ఏళ్లపాటు పనిచేశాను. హైదరాబాద్ బస్తీ దవాఖానలో, కొల్లాపూర్‌లో పనిచేశాను. గతేడాది జనవరి 1నుంచి జనరల్ ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ క్యాడర్‌లో ఆర్‌ఎంఓగా పనిచేస్తున్నాను. రాబోయే రోజుల్లో గైనిక్ పూర్తిచేసి, మంచి గైనకాలజిస్ట్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది.

– డాక్టర్ శిరీష, ఆర్‌ఎంఓ, జనరల్ ఆస్పత్రి

క్లుప్తంగా

'సామూహిక మరుగుదొడ్లు నిర్మించండి'

చిన్నంబావి: మండల కేంద్రంలో సామూహిక మరుగుదొడ్లు లేవని, వెంటనే నిర్మించాలని బీఎస్పీ మండల ఉపాధ్యక్షుడు వెంకట్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే పరిసర గ్రామాల ప్రజలు మరుగుదొడ్లు లేక చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మైసమ్మ జాతరలో భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మైసమ్మ దేవతకు మొక్కులు తీర్చుకున్నారు. వానాకాలం ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులంతా మైసమ్మ దేవతను దర్శించుకొని పంటలు బాగా పండాలని మైసమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేటు, ప్రభుత్వ వాహనాలలో పెద్ద ఎత్తున తరలివచ్చారు. మైసమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు, విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, కొత్త లైన్ ఏర్పాటు చేసినట్లు సబ్ ఇంజినీర్ సురేష్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిచిపోయిందని, ఆ తర్వాత విద్యుత్ సరఫరా చేశామని ఆయన తెలిపారు. పనులను జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ యాదవ్ పరిశీలించారు.

ఎస్‌ఐగా బాధ్యతలు



పాన్‌గల్: మండల ఎస్‌ఐగా కల్యాణ్ రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వేణు సీసీఎస్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌బీ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చెరువు కట్టపై ముళ్లపొదలు తొలగించండి



పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి –కేతేపల్లి గ్రామాలకు వెళ్లే దారిలో బొల్లిగట్టు చెరువుకట్టపై ఏపుగా పెరిగిన ముళ్లపొదలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. చెరువు కట్ట రోడ్డు ఇరుకుగా ఉండటం మరొపక్క ఏపుగా పెరిగిన కంపచెట్లు ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదే రోడ్డుపై గతంలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో నలుగురు మృత్యువాత పడటం, ఇటీవలనే ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నపూర్ణదేవికి ప్రత్యేక పూజలు



దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామివారి ఆలయంలో అన్నపూర్ణ దేవి ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు జంగం శరణయ్య స్వామి సమక్షంలో అమ్మవారికి పంచామృతాభిషేకం అలంకరణ హారతి, భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి కల్యాణం, సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పూజ కార్యక్రమంలో దాతలు కానగడ్డ బస్వరాజ్ సువర్ణమ్మ కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ, గుల్బర్గా గోవిందరాజ్ పాల్గొన్నారు.

బీటీరోడ్డు కోసం నిరసన దీక్ష


రేమద్దులలో దీక్షలో కూర్చున్న బీజేపీ నాయకులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల–ఏదుట్ల–సింగాయిపల్లి మధ్య గుంతలమయంగా ఉన్న రోడ్డును బీటీగా మార్చాలని కోరుతూ బీజేపీఆధ్వర్యంలో ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నరేందర్‌రెడ్డి మాట్లాడారు. వివిధ గ్రామాలతో కలుపుతూ నాలుగు వైపులా రోడ్లు గుంతలమయంగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా ఉన్నాయన్నారు. వెంటనే స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. దీక్షను నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పాల్గొని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో తిరుపతయ్య, సుందర్‌రెడ్డి, రవీందర్, చక్రవర్తి, చల్మారెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడల నిర్మాణాలు పూర్తి

- రోడ్లపై ప్రమాదాల నివారణకు చర్యలు
- గతంలో అనేక ప్రమాదాలు


అప్పారెడ్డిపల్లి సమీపంలో పాత బావి వద్ద నిర్మించిన రక్షణ గోడ

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా పురాతన పాడుబడిన బావులు ఉండటంతో పలు మార్లు ప్రమాదాలు జరిగాయి. గమనించక ఆటోలు, మోటర్ సైకిళ్లు నడిపే వారు బావుల్లో పడి ప్రమాదాలకు గురయ్యారు. రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని పలు సందర్భాల్లో ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. ఎట్టకేలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని ఆర్‌అండ్‌బీ రోడ్లతో పాటుగా రక్షణ గోడల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. అధికారులు గుర్తించి నాలుగు బావుల వద్ద రక్షణ గోడలు నిర్మించడంతో పాటుగా పైపు కల్వేట్లు పాడైన వద్ద కొత్తగా పైపులు వేయించారు. చాలారోజుల తర్వా రక్షణ గోడలు, పైపు కల్వెట్ల నిర్మాణాలను నిర్మించడంపై మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తికాని రోడ్డు పనులు

మండల కేంద్రం నుంచి పర్వతాపురం, మామిడిమాడ, సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లితో పాటు వెలిక్ చెర్ల, గొరారం వెళ్లేందుకు అవకాశం ఉన్న రోడ్డు పనులను కాంగ్రాక్టర్ అసంపూర్తిగా చేసి వదిలేశాడు. పర్వతాపురం వరకు రోడ్డు పనులు చేసి అక్కడి నుంచి ఖిల్లాఘనపురం వరకు ఉన్న రోడ్డు పనులు చేపట్టలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవతీసుకుని పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాన్‌గల్‌లో కోతుల గుంపు



కోతుల బెడద నివారించండి

పాన్‌గల్: మండల కేంద్రంలో రోజు రోజుకు పెరుగుతున్న కోతులతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కోతులు గుంపులు, గుంపులుగా చేరి ఘర్షణ పడుతుండటంతో పాటు మనుషులపై దాడులకు దిగుతుండటం, పిల్లలు తినుబండరాలను లాక్కెళుతున్నాయి. ఆదివారం రోజు బియ్యం స్టాక్ పాయింట్ ముందు కోతుల గుంపులుగా సంచరించాయి.


పత్తివిత్తనాలను విత్తుతున్న వ్యవసాయ కూలీలు

అరక కదిలింది.. విత్తు పడింది

అమరచింత: కొన్ని రోజుల నుంచి వర్షాలు కురవకపోవడంతో రైతులు దిగాలు చెందారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి పొలాలు పదునవ్వడంతో రైతులు తమ దుక్కిదున్నడంతో పాటు విత్తనాలను చల్లుకుంటున్నారు. అమరచింత మండలంలోని పాంరెడ్డిపల్లె శివారులో పత్తివిత్తనాలను విత్తుతు వ్యవసాయ కూలీలు పనుల్లో లీనమయ్యారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఖిల్లాఘనపురంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఖిల్లాఘనపురం/పెబ్బేరురూరల్/కొత్తకోటరూరల్/ఆత్మకూరు: ఖిల్లాఘనపురం మండలంలోని మానాజీపేట ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బాజా భజంత్రీలతో ఊరేగింపుగా పాఠశాలకు చేరుకున్న నాటి విద్యార్థులు గురువులు విశ్వనాథం, రాములు, రఘునాథ్, అహ్మద్, పుల్లయ్యగౌడు, శేఖరయ్య, బి.కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, మన్నెపురెడ్డి, బుచ్చిలింగం, కొండన్న, కొండారెడ్డి, జంగయ్యలను ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు.

పెబ్బేరు మండలం కంచిరావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా ఒకే వేదికపై 26 ఏళ్ల తర్వాత కలిశారు. అప్పటి ఉపాధ్యాయులు గురుమూర్తి, వీరశేఖరాచారి, సుధాకరాచారి, వెంకటేశ్వర్‌రెడ్డిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.


పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలో..

కొత్తకోటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–88లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. అనంతరం అందరు కలిసేందుకు కృషి చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పూర్వ విద్యార్థులను తోటి మిత్రులు అభినందించారు.

ఆత్మకూర్‌లో నాగార్జున హైస్కూల్‌లో 1996, 1997, 1998 పదో తరగతి చదివిన విద్యార్థులు ఒకేచోటికి చేరడంతో సందడిగా మారింది. గురువులు భుజంగరావ్, బందేష్, శ్రీధర్‌జ్యోషి, వెంకటేశ్వర్‌రెడ్డి, తంగెళ్లశ్రీదేవిరెడ్డి, రమాదేవి, గీత, శ్రీదేవిలను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు.


కొత్తకోటలో..


ఆత్మకూర్‌లో..

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి

పెబ్బేరు రూరల్: ప్రతి ఉద్యోగికి విరమణ అనేది తప్పనిసరి అని ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. వనపర్తి పట్టణంలోని తెలుగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అనురాధ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీధర్ పాల్గొని సన్మానించారు.

నిరుపయోగంగా ట్రాన్స్‌ఫార్మర్



వీపనగండ్ల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ట్రాన్స్‌కో అధికారులు అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌కు వెంటనే కనెక్షన్ ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. దాదాపు ఆరు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు సర్వీసు వైర్ లేదన్న కారణం చేత ట్రాన్స్‌ఫార్మర్‌కు సప్లయి ఇవ్వలేదని దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపు


పాతపాలమూరులో ఆది దేవత మైసమ్మదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు


మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ పట్టణంలోని 11వ వార్డు పాతపాలమూరులో వెలసిన శ్రీ ఆది దేవత శ్రీ మైసమ్మదేవి అమ్మవారి దేవస్థానం కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతోంది. ఇంత విశిష్టత గల అమ్మవారి ఉత్సవాలు ప్రతి సంవత్సరం అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా మైసమ్మదేవి 180వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సమయంలో అమ్మవారి బోనాల వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకరించిన బోనం కుండలను తలపై పెట్టుకొని మహిళలు వార్డులోని పురవీధుల గుండా ఊరేగింపుగా మైసమ్మ దేవాలయం వరకు తరలివచ్చారు. బ్యాండు, తప్పెట్ల వాయిద్యాలు, శివసత్తుల పూనకాల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి ఆలయం చుట్టూ మహిళలు సాంప్రదాయరీతిలో ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజల చేసిన అనంతరం అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించారు.

పంట కాల్వలకు మహర్దశ


కుడికిల్ల సమీపంలో కేఎల్‌ఐ పంట కాల్వలో ఏపుగా పెరిగిన జమ్ము

కొల్లాపూర్‌రూరల్: మండలంలోని ఎల్లూరు గ్రామ సమీపంలో నిర్మించిన మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న పంట కాల్వలకు త్వరలో మహర్దశ రానుంది. ఇటీవల కాలువలను శుభ్రం చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మహర్దశ రానుండటంతో ఆయకట్టు రైతులు సంబురపడుతున్నారు. 12 సంవత్సరాల కిందట కేఎల్‌ఐ ప్రాజెక్టును ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించింది. కొల్లాపూర్ మండలంలోని గ్రామాల్లో రైతుల భూములకు ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించేందుకు ఐదు పంట కాలువలను నిర్మాణం చేశారు. అప్పటినుంచి నుంచి ఇప్పటివరకు పంట కాలువలలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, జమ్ము తొలగించాలని రైతులు ఎన్నో సార్లు కేఎల్‌ఐ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని రైతులు వాపోయారు. పంటలను కాపాడుకునేందుకు రైతులే సొంత ఖర్చులతో శుభ్రం చేస్తున్నారు. ఈ నెల 28న మంత్రి జూపల్లి కృష్ణారావు కేఎల్‌ఐ ప్రాజెక్టును సందర్శించి అధికారులతో సమీక్షించారు. అక్కడ రైతులు మంత్రి దృష్టికి పంట కాలువల శుభ్రత గురించి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన మంత్రి తక్షణమే పంట కాలువలన్నీ శుభ్రపరచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎన్నో ఏండ్లుగా పంట కాలువలకు సాగు నీరు సరఫరా సక్రమంగా రాక ఇబ్బందులు రైతులు ఇబ్బంది పడుతున్నారు. కేఎల్‌ఐ పంట కాలువల కింద మండలంలోని రైతుల పొలాలు దాదాపుగా అనధికారంగా 50 వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. పంట కాలువలను శుభ్రం చేస్తే ఇంకా సాగు పెరిగే అవకాశం ఉంది. కాలువలకు త్వరగా కృష్ణా నదికి నీరు వచ్చే లోపే పంట కాలువలు శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరుకు ఢోకా ఉండదు



ప్రతి సంవత్సరం సొంత ఖర్చులతో కాలువలను శుభ్రం చేస్తున్నాం. ప్రస్తుతం మంత్రి జూపల్లి కృష్ణారావు పంట కాలువలను శుభ్రం చేస్తామని చెప్పడం శుభపరిణామం. కాలువలలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగిస్తే సాగు నీరు పుష్కలంగా అందుతోంది. పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

– కుమ్మరి కురుమయ్య, రైతు, కుడికిల్ల